www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4  సంచిక -55  మంగళవారం 9 జూన్ 2026  ఎడిటర్ : మారేపల్లి అశోక్  పేజిలు -8  వెల - 3/-  01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

## విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం..

### హాట్ మెటల్ పడి ఎనిమిది మంది సజీవ దహనం



**స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో చోటుచేసుకున్న ఘటన**

**పలువురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**

**మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన**

**విశాఖపట్నంజూన్ 8 (ప్రజావినికిడి):** విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో సోమవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు సజీవ దహనం కాగా, మరికొందరు తీవ్రంగా **మిగతా 2లో...**

## పెళ్లికి ముందు సంబంధం తప్పుకాదు



**పెళ్లికి ముందు లైంగిక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు**

**కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు**

**మారుతున్న కాలంలో ఇది సాధారణం**

**దీని ఆధారంగా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమన్న కోర్టు**

**ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆదేశం**

**న్యూఢిల్లీ,జూన్ 8 (ప్రజావినికిడి):** ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే.. దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టం చేసింది.తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే అభ్యర్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం**మిగతా 2లో...**

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

**సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు**

**రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం**

**ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**




**న్యూఢిల్లీ,జూన్ 8 (ప్రజావినికిడి):** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ **మిగతా 2లో...**

# మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుకుంటున్నారు

**రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు గులాంగిరి**

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన**

**రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం**

**కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్**

**హైదరాబాద్,జూన్ 8 (ప్రజావినికిడి)::** రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు.**మిగతా 2లో...**




## తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ పై సస్పెన్షన్ వేటు

**అక్రమ రిజిస్ట్రేషన్ ఆరోపణలతో రాము నాయక్ పై వేటు**

**అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిన వైనం**

**ప్రభుత్వ భూములను కబ్జా చేసేవారిని వదిలేది లేదన్న మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్,జూన్ 8 (ప్రజావినికిడి):** తెలంగాణ రెవెన్యూ శాఖలో భారీ భూ దందాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.**మిగతా 2లో...**

## మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

**మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి**

**మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి**

**మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ పిలుపు**

**హైదరాబాద్,జూన్ 8(ప్రజావినికిడి):** తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న **మిగతా 2లో...**



## 'నాలెడ్జ్' విప్లవం

**రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ -రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ**

**ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్**


**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**



2లో.

## నేడు ఢిల్లీకి చంద్రబాబు, పవన్ కళ్యాణ్

**10న ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సిఎం, డిప్యూటి సిఎంల భేటీ**



2లో.

## బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్

**మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు**

**కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



2లో.

# పెళ్లికి ముందు సంబంధం తప్పుకాదు

మొదటిపేజీ తరువాయి

చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది.లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకొన్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్ బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొంది.చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

# విశాఖ స్టీల్ ప్లాంటులో ఘోర ప్రమాదం..

మొదటిపేజీ తరువాయి



గాయపడ్డారు. స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో ఈ విషాదం ఘటన చోటుచేసుకుంది.

స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2లో కన్వేయర్ ద్వారా హాట్ మెటల్ (మరుగుతున్న ఉక్కు ద్రవం) ఉన్న ల్యాడిల్స్‌ను తరలిస్తుండగా అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. దీంతో అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఉన్న ఉక్కు ద్రవం... కింద పనిచేస్తున్న కార్మికులపై పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ప్లాంటు అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఈ ఊహించని దుర్ఘటనతో స్టీల్ ప్లాంటులో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల ప్రాథమిక కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# నేడు ఢిల్లీకి చంద్రబాబు, పవన్ కళ్యాణ్

## 10న ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సిఎం, డిప్యూటి సిఎంల భేటీ

**అమరావతి,జూన్ 8 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జూన్ 10వ తేదీన నిర్వహించనున్న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొననున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

దేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది.

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

మొదటిపేజీ తరువాయి

క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్

## మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్ (ప్రజావినికిడి):** క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు.

# మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుకుంటున్నారు

మొదటిపేజీ తరువాయి



స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్దిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్ పై సస్పెన్షన్ వేటు



2013-18 మధ్య హౌసింగ్ బోర్డులో భూసేకరణ అధికారిగా పనిచేసిన సమయంలో రాము నాయక్ పలు అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలన చేస్తుండగా ఈ లీలలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్లో గజం రూ.2 లక్షలకు పైగా పలికే హైకోర్టు సమీపంలోని హౌసింగ్ బోర్డు స్థలాన్ని, గతంలో తొలగించబడిన వర్క్ ఇన్‌స్పెక్టర్ భార్య పేరిట 2018లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించారు. దీనికి సహకరించిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్‌పైనా విచారణకు ఆదేశించారు.విజయ్‌నగర్ కాలనీ, లక్ష్మిగూడ సహా పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను అక్రమంగా బదిలీ చేసినట్లు రాము నాయక్‌పై 2017 నుంచి కేసులు ఉన్నాయి. ఈ దందాకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్‌ను ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించగా, మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని మంత్రి హెచ్చరించారు.

# తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం

**హైదరాబాద్,జూన్ 8 ((ప్రజావినికిడి):** ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ద

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 9 జూన్ 2026

## ఐకాన్ వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం..

### ముఖ్య అతిధిగా పాల్గొన్న:ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..




**నాగోల్, (ప్రజావినికిడి):**నాగోల్ బండ్లగూడ ప్రాంతాలకు చెందిన ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ఆరోగ్యకరమైన జీవనశైలి,ప్రకృతి పరిరక్షణ పర్యావరణ అవగాహన లక్ష్యాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు."ప్రకృతిని ప్రేమిద్దాం.పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ, మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ఆరోగ్య పరిరక్షణకు నడక యొక్క ప్రాముఖ్యతను వివరించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే ప్రతిరోజూ నడక అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని,సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించేందుకు ఐకాన్ వాకర్స్ గ్రూప్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐకాన్ వాకర్స్ గ్రూప్ అధ్యక్షులు చెరుకు ప్రశాంత్ గౌడ్,జనరల్ సెక్రెటరీ రమేష్ గౌడ్,వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి,కోశాధికారి రమేష్,జాయింట్ సెక్రెటరీ పెంటారెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ,సలహాదారులు ప్రతాప్ రెడ్డి,తూర్పాటి చిరంజీవి,చెరుకు చిరంజీవి,ఈశ్వర్ గౌడ్ సభ్యులు,సీతారాములు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

## పేసా చట్టానికి విరుద్ధంగా గ్రామసభలు

### ఏజెన్సీ ప్రాంతాలలో పిసా గ్రామ సభలు నిర్వహించాలి

### జిఎస్పి మండల అధ్యక్షుడు పద్దం సుధాకర్..



**వాజేడు,జూన్ 9,(ప్రజావినికిడి):**ఐదవ షెడ్యూల్ భూభాగంలోని ఏజెన్సీ గ్రామాలలో పీసా గ్రామసభల ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని మండల అధ్యక్షుడు పద్దం సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం నాడు గుమ్మడిదొడ్డి గ్రామంలో అన్ని శాఖల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించడం జరిగింది.ఈ సభకు గోండ్వాన సంక్షేమ పరిషత్ వాజేడు మండల అధ్యక్షుడు పద్దం సుధాకర్ పాల్గొని,అధికారులకు ఏజెన్సీ ప్రాంత సమస్యలపై వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామ సభలకు లోబడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, పీసా చట్టం ప్రకారం ఆదివాసులకు షెడ్యూల్ ప్రాంతాలలో స్వయం పరిపాలన అధికారం ఉందని తెలిపారు.స్థానిక వనరులపై పూర్తి హక్కు ఆదివాసులకే ఉంటుందని వారి అనుమతులు లేకుండా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకూడదని అన్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామసభకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలని,పీసా రూల్స్ 2011 రూల్ నెం.4,8-(1) క్లాజ్ -3 (2) సెక్షన్‌లో పేర్కొన్నారని వివరించారు.1996 పీసా చట్టం సెక్షన్ 4(ఎ)(బి)(డి)(ఇ)(ఎం-1) చట్టం ప్రకారం ఏజెన్సీ గ్రామాల్లో ఆదివాసీల ఆచారాలు, సంస్కృతి, సాంప్రదాయాలు,సామాజిక న్యాయపరమైన పద్ధతులు ఉంటాయని చెప్పారు,సామాజిక వనరుల నిర్వహణ, పరిరక్షణ,సాంప్రదాయ పద్ధతుల్లో వివాదాలు పరిష్కరించుకోవడానికి, అధికారాలను అమలు చేసుకోవడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం,మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడం,రద్దు చేయడంలో అంతిమ అధికారాలు పీసా చట్టం ప్రకారం గ్రామసభకు మాత్రమే ఉందని వివరించారు.ఈ విషయంలో పీసా గ్రామసభ ఆమోదం,తీర్మానం అత్యంత కీలకమైందని అన్నారు.పీసా చట్టాన్ని ఎవరు ఉల్లంఘించిన ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంగిస్తే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ భరత్ కుమార్,ఎట్టి విద్యాసాగర్ ఆదివాసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### 10వ,తేది చలో కలెక్టరేట్ అధిక ధరలను వ్యతిరేకిస్తూ

## సిపిఐ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయండి.. :ఎండి పై మీద..



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలను అరికట్టలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా 10వ తేదీ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యురాలు ఎండి పై మీద మాట్లాడుతూ, గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు పెరుగుతున్నందున నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి రోజువారి కూలి చేసుకునే వారికి పూట గడవడం ఇంటి అద్దె పిల్లల ఫీజులు ఆరోగ్య సమస్యలు ఇలా అన్నిటిని ఎదుర్కొంటూ చాలీచాలని జీవితాలతో ఈరోజు కూలినాలి చేసుకునే వాళ్ళు చిన్న కుటీరమ పరిశ్రమలు అనేక మూతపడుతున్నాయి వీటన్నిటికీ కారణం కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలను కాపాడవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలది నిత్యవసర ధరలు పెరుగుదల కు వ్యతిరేకంగా కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది

## లక్ష్మీదేవిపల్లి భూసేకరణ ప్రక్రియకు అవసరమైన చర్యలు

### ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రామ్మోహన్ రెడ్డి - రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్‌తో భేటి



**హైదరాబాద్, (ప్రజావినికిడి):** కొందుర్గు-పరిగి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ కోరారు.ఈ మేరకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డితో కలిసి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీధర్‌ను సచివాలయంలో కలిసి ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. భూసేకరణ ప్రక్రియకు అవసరమైన ఆర్థిక అనుమతులను త్వరగా మంజూరు చేసి,రంగారెడ్డి అలాగే వికారాబాద్ జిల్లాల కలెక్టర్ల ద్వారా భూసేకరణ నోటిఫికేషన్ జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ అత్యంత కీలకమని,రైతులు అలాగే ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సాగు,తాగునీటి అవసరాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యేలు, పెండింగ్‌లో ఉన్న పరిపాలనా మరియు ఆర్థిక అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీధర్, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి పథకంలో కీలక దశకు కేపీ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్

### పరిగి-షాద్‌నగర్ ప్రాంతాలకు సాగు,తాగునీటి ఆశాకిరణం - భూసేకరణ ప్రక్రియ వేగవంతంపై అధికారుల చర్చ

### కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులపై అధికారులతో ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" సమీక్ష సమావేశం..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో ప్రతిపాదిత కొందుర్గు-పరిగి- లక్ష్మీదేవిపల్లి (కేపీ లక్ష్మీదేవిపల్లి) రిజర్వాయర్ పనుల పురోగతిపై షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఇంజినీరింగ్ అధికారులు ఈఈ దయానంద్, ఎస్ఈ రవికుమార్ పాల్గొని ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనులు, పరిపాలనా అనుమతుల అంశాలపై చర్చించారు.ఈ సమీక్షా సమావేశంలో భాగంగా ప్రాజెక్టు కింద చేపట్టనున్న ప్యాకేజీ-19,20, 21పనుల వివరాలను పరిశీలించారు. రిజర్వాయర్ బండ్ నిర్మాణం,పంప్ హౌస్ ఏర్పాటు, ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వరకు కాలువలు, టన్నెల్ నిర్మాణాల కోసం మొత్తం 2,919 ఎకరాల భూమి అవసరమని అధికారులు వివరించారు.

భూసేకరణకు సుమారు రూ.350.84 కోట్ల వ్యయం అంచనా వేయగా, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేసి పరిపాలనా, ఆర్థిక అనుమతులు పొందే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ ప్రాజెక్టు పూర్తయితే పరిగి, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో సాగు,తాగునీటి అవసరాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయాభివృద్ధికి,ప్రాంతీయ ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని అధికారులు ఎమ్మెల్యే శంకర్ తో పేర్కొన్నారు.

**నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు**

ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే షాద్‌నగర్,పరిగి ప్రాంతాల్లో సాగు మరియు తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులకు నీటి వనరులు అందుబాటులోకి రావడంతో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడటమే కాకుండా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లుల విడుదల

### రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్ల మంజూరు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





**కూసుమంచి,/జూన్ 8 (ప్రజావినికిడి):**
రాష్ట్రంలోని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.సోమవారం కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల మంజూరుతోనే ప్రభుత్వ బాధ్యత ముగియదని, నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం బిల్లులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.రాజుపేట గ్రామంలో వన్నాపురం సుభద్ర, దాసరి భద్రయ్య, కోట వీరారెడ్డి, సంద్ర ఎల్లమ్మ, గట్టు సింగారం గ్రామంలో గుంటి దుర్గా, గుడిపల్లి వెంకట నరసమ్మ, దివ్వల రమేష్, గుడిపల్లి జ్యోతి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.రాజుపేట గ్రామంలో మంజూరైన ఇళ్లలో నాలుగు పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. అలాగే గట్టు సింగారం గ్రామంలో 19 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 10 ఇళ్లు పూర్తై గృహప్రవేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.చివరి అర్హ లబ్ధిదారుడికి కూడా ఇందిరమ్మ ఇల్లు అందే వరకు దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.నూతన గృహాల్లోకి ప్రవేశించిన కుటుంబాలకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇంట్లో సుఖసంతోషాలతో, ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..





**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటని,భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
సోమవారం మియాపూర్‌లో నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.
దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, కలకత్తా,చెన్నై, హైదరాబాద్ నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇతర మహానగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదహరిస్తూ, ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వర్షాకాల ముంపు, బెంగుళూరు, చెన్నై,కలకత్తాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

### హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించిన కారణం ఇదే

హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడేలా పరిపాలనా సరిహద్దులను నిర్ణయించామని చెప్పారు. జెండాలు, ఎజెండాలకు అతీతంగా నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

### విద్య,గృహ నిర్మాణం, మహిళా సాధికారతకు ప్రాధాన్యం

పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు.
మహానగరంలో లక్ష ఎల్ ఐ జి,ఎం ఐ జి ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని, గతంలో రాజీవ్ గృహకల్ప తరహాలో ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకే సమీపంలో గృహాలు నిర్మించి అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తం చేసి పేదల గృహ నిర్మాణానికి వినియోగిస్తామని తెలిపారు.
మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందిరా మహిళా శక్తి ద్వారా 150 వాణిజ్య స్టాల్స్ మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. మహిళలను పెట్రోల్ బంకుల యజమానులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

### మెట్రో విస్తరణ, అంతర్జాతీయ బస్ టెర్మినల్

విశ్వనగరంగా ఎదగాలంటే అందుకు తగిన మౌలిక వసతులు అవసరమని పేర్కొంటూ మెట్రో రెండో దశ విస్తరణ పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గాజులరామారంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. మూడు నెలల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

### తెలంగాణకు కేంద్ర నిధులపై బీజేపీ ఎంపీలను ప్రశ్నించిన సీఎం

తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో ఎందుకు చొరవ చూపడం లేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన నిధుల సాధనలో ముందుండాలని సూచించారు.
గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధిని ప్రశంసించే వారు, తెలంగాణలో మూసీ నది అభివృద్ధి కార్యక్రమాలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరారు.

### అభివృద్ధిపై చర్చకు సిద్ధం

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలోని పన్నెండేళ్ల బీజేపీ పాలన,ప్రస్తుతం 30 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఎవరు రాష్ట్రానికి ఎంత అభివృద్ధి చేశారో,ఎన్ని నిధులు తెచ్చారో ప్రజల ముందే చర్చిద్దామని అన్నారు.

### రాబోయే 24 నెలలు అభివృద్ధికే అంకితం

రాష్ట్ర ప్రభుత్వం రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి సారిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

### ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు

దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటి.
భవిష్యత్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాం.
మెట్రో రెండో దశ విస్తరణ పనులు చేపడుతున్నాం.
గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం.
మహానగరంలో లక్ష ఎల్ఐజి,ఎంఐ జి గృహాల నిర్మాణానికి ప్రణాళిక.
యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు.
విద్యార్థులకు పాఠశాల నుంచి ఇంటర్ వరకు అల్పాహార పథకం అమలు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,150 వాణిజ్య స్టాల్స్ కేటాయింపు.
తెలంగాణకు కేంద్ర నిధుల సాధనలో బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి.
రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకే అంకితం. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి,రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి అరికెపూడి గాంధీ, ప్రభుత్వ సలహాదారులు కార్పొరేషన్ చైర్మన్లు ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలను ఆషామాషీగా తీసుకోవద్దు.. ప్రాణం పెట్టి ఆడితేనే గుర్తింపు

### బిపిఈడి ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులు తమ సత్తా చూపించారు.





**పరిగి,(ప్రజావినికిడి):**
క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేసిన కుల్కచర్ల మండల బి.పి.ఈ.డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కె వి ఎం కుల్కచర్ల కాలేజీ లో ప్రాక్టికల్స్ స్పోర్ట్ మీట్స్ పెట్టడం జరిగింది. కేవీఎం కాలేజ్ విద్యార్థులు తన సత్తాను చూపించారు విద్యార్థులు గెలిచిన వారికి బహుమతుల ప్రధానం చేసిన కరణం ప్రహ్లాదుల్ రావు,ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ వారువల ఆంజనేయులు,బీజేపీ మండల ప్రజాపక్షులు వెంకటేష్,జిల్లా కార్యనివాక సభ్యుడు మైపస్ , బాలకృష్ణ రెడ్డి వైస్ ప్రెసిడెంట్,బిపిఈడి ప్రిన్సిపాల్ మహేంద్ర రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ పెన్నప్ప , పాల్గొన్నారు క్షేత్రస్థాయిలో కష్టపడి ఆటలు ఆడినప్పుడే మనము గొప్ప క్రీడాకారులుగా తయారవుతామనిఎట్టి పరిస్థితుల్లో క్రీడలను ఆషామాషీగా తీసుకోరాదని చెప్పరు ఇప్పుడున్న స్థాయిలో మీరు కష్టపడితేనే మీరు విద్యార్థులకు మరెన్నో మంచి బోధనత ముందుకు తీసుకెళ్తారు ఇప్పుడున్న ఫిజికల్, ఎడ్యుకేషన్ విద్యార్థులు మీరు మంచి స్థాయికి వెళ్లి కష్టపడితేనే ఫలితం దక్కుతుంది మీరు చదువుకొని మీరు మీ విద్యార్థులకు మంచి స్థాయికి కూడా తీసుకెళ్లాలి ఎండనక వాననక మట్టిలో ఆడి రక్తం, చెమట చిందించినపుడే క్రీడల్లో రానిస్తామని, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అన్నారు. కార్యక్రమానికి కర్ణ ప్రహ్లాదుల్ రావు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రభుత్వరంగ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన క్రీడాకారులను కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల వారిలోని ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ వేదికలకు కప్ లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశామని అన్నారు.రాష్ట్ర స్థాయి వరకు అథ్లెటిక్స్,కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్,ఖో-ఖో, బ్యాడ్మింటన్,క్రికెట్ విభాగాల్లో పోటీలు నిర్వహించడం పల్లె క్రీడాకారుల కలలకు స్వర్గ ధామం అని పేర్కొన్నారు.మీ జీవితాన్ని మార్చుకోవాలని చదువుతోపాటు వివిధ రంగాలలో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీస్తున్న బిపిడి ప్రిన్సిపాల్ మహేంద్ర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## మెదడు కణితులు వ్యాధి భారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు..

### డా.ఎం.సునీత..



**శంషాబాద్, (ప్రజావినికిడి):** ముందస్తు చర్యలతో మెదడు కణితులు వ్యాధి భారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చాని డా.ఎం.సునీత పేర్కొన్నారు. ప్రపంచ మెదడు కాణితి దినోత్సవం సందర్భంగా హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ నిపుణులు మెదడు కణితుల ప్రారంభ హెచ్చరిక లక్షణాలను గుర్తించడం అలాగే సమయానికి వైద్య పరీక్షలు చెయించుకోవడం యొక్క ప్రాముఖ్యతపై శంషాబాద్లో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సినియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ క్లినికల్ డైరెక్టర్ డా. ఎం.సునీత మాట్లాడుతూ,మెదడు కణితులు ఏ వయస్సు వారినైనా ప్రభావితం చేయగలవని ఇవి తరచుగా నిరంతర తలనొప్పి, మూర్ఛలు, కారణం తెలియని బలహీనత,చూపు సమస్యలు, మతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి లోపాలు లేదా వ్యక్తిత్వ మార్పులు వంటి లక్షణాలతో కనిపించవచ్చుని ముందస్తు నిర్ధారణ అదేవిదంగా తక్షణ చికిత్స వల్ల చికిత్స ఫలితాలు మెరుగుపడి, జీవన నాణ్యతను కాపాడుకోవచ్చని తెలిపారు.తాజా ఆవిష్కరణలలో ఒకటైన ఎంఆర్ రైనాక్ టెక్నాలజీ, అధిక నాణ్యత గల ఎందర్ ఇమేటింగును రేడియేషన్ చికిత్సలో కలిపి, వైద్యులకు కణితిని రియల్ టైమ్లో లో గమనించే అవకాశం కల్పిస్తుంది.దీని ద్వారా చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన మెదడు కణజాలాన్ని రక్షిస్తూ అత్యంత ఖచ్చితత్వంతో చికిత్స అందించవచ్చుని లిపారు.ప్రజలకు లక్షణాలపై అప్రమత్తంగా ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం పొందాలని సూచించారు.

## పెంచిన పెట్రో ధరలకు నిరసన

### 10న జిల్లా కలెక్టరేట్ ముందు సిపిఐ ధర్నా

**నల్లగొండ,జూన్8((ప్రజావినికిడి):**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి సమావేశం కామ్రేడ్ డి.లింగా నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేయగా బంటు వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 10వ తేదీన నల్లగొండ కలెక్టరేట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు ఇప్పటికీ ఆరుసార్లు పెంచడంతో సామాన్య ప్రజలకు గుదిబండగా మారిందన్నారు. రైతు కొనే అడుగు పిండి బస్తాకు రూ.300 నుండి 400 పెంచడం వల్ల, యూరియా ఆన్‌లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేయాలంటే 60 శాతం రైతులకు ఆ యాప్ గురించి అవగాహన లేకపోవడంతో రైతులు యూరియా గురించి అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ యాప్ ని రద్దుచేసి రైతులకు అధికారుల ద్వారా నేరుగా యూరియా అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి డి.శాంత, మండల సమితి సభ్యులు పాల్గొన్నారు.

-----

## రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్,జూన్8(ప్రజావినికిడి):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సమీకృత పాఠశాలలు నిర్ణయంపై టిఆర్ఎస్ చీఫ్ కె.కవిత మండిపడ్డారు. రాష్ట్రంలోని 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు సిఎం ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సిఎం కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇప్పుడు



పాఠశాలలు మూసివేస్తున్నామని ప్రకటించారని, విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అన్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

### మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు -సిఎం రేవంత్ సమక్షంలో నేడు అందచేత

**హైదరాబాద్,జూన్8(ప్రజావినికిడి):**



మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, భద్రత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరు కానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సిఎస్ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూత నిస్తున్నదని అన్నారు. మహిళల కోసం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఫథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు కోసం ఆయా రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వస్తున్నారని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ లు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, రవాణా కమిషనర్ ఇలంబర్తి, సీఈఓ దివ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# యూరియా యాప్‌తో రైతులకు మేలు

### అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి -ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ

### మంత్రి తుమ్మల కార్యాలయం ప్రకటన

**హైదరాబాద్,జూన్8(ప్రజావినికిడి)::** రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని



తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఈ÷ూం÷ూ ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ÷ూం÷ూ యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ల్గ÷తుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

# శంషాబాద్ లో విషాదం..

### భార్య మృతిని తట్టుకోలేక..భర్త ఆత్మహత్య..

**శంషాబాద్, (ప్రజావినికిడి): జూన్ 8:**



శంషాబాద్ మండలం గొల్లపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం..

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని గొల్లపల్లి కి చెందిన అద్దెదుల శుకపురం శ్రీకాంత్ , వయస్సు 35, దుబాయిలో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తున్నాడు. జూన్ 2న శ్రీకాంత్ భార్య స్వప్న గొల్లపల్లి లోని వారి ఇంట్లో ఫ్యాన్ కి ఉరి వేసుకొని చనిపోయినదని, శ్రీకాంత్ జూన్ 3 న దుబాయి నుండి గొల్లపల్లి లోని వారి ఇంటికి వచ్చారు. అప్పటి నుండి గొల్లపల్లి లోనే ఉన్నారు.జూన్ 6 న శ్రీకాంత్ కొద్దిసేపు పడుకుంటాను అని కుటుంబ సభ్యులకు చెప్పి రూమ్ లోకి వెళ్ళాడు. కొద్దిసేపటి తర్వాత తన అన్న వినోద్ కుమార్ శ్రీకాంత్ కు ఫోన్ చేయగా అతను ఫోన్ ఎత్తక పోవడంతో మద్యాహ్నం 12:10 గంటలకి తను ఉంటున్న రూమ్ వద్దకి వెళ్లి చూడగా తలుపులు మూసివేసుకొని ఉన్నాడు. ఎంత పిలిచిన కూడా పలుకక పోవడంతో అట్టి రూమ్ యొక్క డోర్ పగలగొట్టి లోపలికి వెళ్ళి చూడగా, రూమ్ లోపల పై కప్పుకి ఉండే ఇనుప పైపు కి చీరతో ఉరివేసుకొని వ్రేలడుతూ కనిపించాడు. వెంటనే క్రిందకి తీసి చూడగా శ్రీకాంత్ చనిపోయి ఉన్నాడు. అయితే తన భార్య ఉరి వేసుకొని చనిపోయినందుకు అదే మనుసులో పెట్టుకుని అట్టి బాధను తట్టుకోలేక తీవ్ర మనస్తాపం చెంది తాను కూడా ఉరి వేసుకొని చనిపోయి ఉండవచ్చు అని కుటుంబ సభ్యులు తెలిపారు.శ్రీకాంత్ యొక్క మరణం పై వారికి ఎవరిపై ఎటువంటి అనుమానం లేదు అని పోలీసులకు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

### అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి



**హైదరాబాద్,జూన్ 8(ప్రజావినికిడి):** ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

### విదేశ్శ ప్రయాణజకలు రాకపై ప్రత్యేక నిఘా

### ఎబోలా లక్షనాలు ఉంటే గుర్తించి గాంధీకి తరలింపు

### వ్యాధి లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వాల్సిందే

### అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర



**హైదరాబాద్,జూన్ 8(ప్రజావినికిడి):** కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. సీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణెలోని ఎన్ఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్, డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని ఆయన వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వివరాలు అందించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. తప్పు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే విషయాన్ని శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మూడు షిఫ్టుల్లో, 24 గంటలపాటు విమానాశ్రయంలో అందుబాటులో ఉంచి పర్యవేక్షణ, సమాచార సేకరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సంతోష్ చౌహాన్, కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పావని, జీఎంఆర్ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ సంజయ్ కుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, రంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారి, ఐడీఎస్పీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శివ బాలాజీ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి డీసీపీ శిల్పవల్లి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు రాకేశ్ రంజన్, అన్న మేరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

### ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్

### పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు

### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్



**హైదరాబాద్,జూన్8(ప్రజావినికిడి):** చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ÷ర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది.శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు.చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# ఆశాజనకంగా నైరుతి విస్తరణ

## పలు ప్రాంతాల్లో తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,జూన్8((ప్రజావినికిడి):**



నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ముందుకు విస్తరిస్తున్నాయి. దీనిప్రభావంతో చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు, మూడు రోజుల్లో తెలంగాణ లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అధికారులు తెలిపారు. వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఓ మోస్తరు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పశ్చిమ-దక్షిణ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈనెల 10వతేదీ వరకు హైదరాబాద్ నగరానికి ఎల్లో అలర్ట్ జారీచేసింది. నాలుగు రోజులు నగరంలో భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, యాదాద్రి -భువనగిరి జిల్లాల్లో మోస్తరు వర్షా లు కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వనపర్తి జిల్లా ఏదుల మండలంలో అత్యధికంగా 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరులో 4.73 సెంటీమీటర్లు, చౌదాపూర్‌లో 3.58, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో 4.06, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.44, వనపర్తి జిల్లా రేవెల్లిలో 3.38, పన్గల్‌లో 2.72, జోగుళాంబ గద్వాల జిల్లా అ లంపూర్‌లో 2.56, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 2.48సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

## 24 క్యారెట్ల ధర .1,51,690కు చేరిక

**న్యూఢిల్లీ,,జూన్8((ప్రజావినికిడి):**




గత వారమంతా తగ్గిన బంగారం ధరలు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజునే మళ్లీ ధరల్లో కోత పడింది. భారత్‌లో మేలిమి బంగారం ధర సగటున రూ.1000 మేర తగ్గింది. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.1,040ల మేర కోత పడింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి కూడా రూ.950ల మేర తగ్గి రూ.1,39,050కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి రూ.2.7 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,51,690ల వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల పసిడి రూ.1,39,050ల వద్ద ట్రేడవుతోంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల మధ్య కొనసాగుతోంది.

# సివిల్ డ్రెస్సులో వెళ్లి హైదరాబాద్ పబ్ గుట్టురట్టు చేసిన మహిళా డీసీపీ!


హైదరాబాద్‌లోని ఓ పబ్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై బట్టబయలు

స్వయంగా వెళ్లి గుట్టురట్టు చేసిన మహిళా డీసీపీ రితి రాజ్

వ్యభిచారం, మైనర్లకు అనుమతి వంటి పలు ఉల్లంఘనలు గుర్తింపు

పబ్ సిబ్బందిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బీఎన్‌ఎస్, పీటా చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం



**హైదరాబాద్:',జూన్8((ప్రజావినికిడి):**నగరంలోని ఒక ప్రముఖ పబ్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారిణి నేరుగా రంగంలోకి దిగారు. సివిల్ డ్రెస్సులో వెళ్లి ఆకస్మిక దాడి నిర్వహించి, అక్కడ గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యభిచార దందాతో పాటు పలు అక్రమాలను బట్టబయలు చేశారు. ఈ ఘటన కూకట్‌పల్లి ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది.కూకట్‌పల్లి డీసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి రితి రాజ్, స్థానిక 'కింగ్స్ అండ్ క్వీన్స్' (క్లబ్ మస్తీ) పబ్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. పబ్‌లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, ఆమె మొదట స్వయంగా మారువేషంలో వెళ్లి అక్కడి పరిస్థితులను నిర్ధారించుకున్నారు. అనంతరం పోలీసు బృందంతో కలిసి మెరుపు దాడి చేశారు.వివిధ మీడియా కథనాల ప్రకారం, కస్టమర్లను ఆకర్షించడం కోసం పబ్ యాజమాన్యం యువతులను పావులుగా వాడుకుంటూ వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. యువకులతో సదరు మహిళలు పరిచయాలు పెంచుకుని, వారితో చాటింగ్ చేస్తూ పబ్ కు రప్పించడం ఈ ప్లాన్ లో భాగం. వారి ద్వారా కస్టమర్ల నుంచి భారీగా బిల్లులు వసూలు చేస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు సహా మొత్తం తొమ్మిది మంది పబ్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ తనిఖీల్లో మరిన్ని నిబంధనలు ఉల్లంఘనలు కూడా వెలుగుచూశాయి. పబ్‌లోకి మైనర్లను అనుమతించడం, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా మద్యం, ఆహారం సరఫరా చేయడం, పోలీసుల నుంచి అవసరమైన నిరభ్యంతర పత్రం లేకపోవడం వంటి అక్రమాలను గుర్తించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్), పీటా చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సదరు పబ్‌పై 2025లో కూడా గతంలో పలు కేసులు నమోదైనట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా !

**',జూన్8((ప్రజావినికిడి):**



ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళు తున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేందప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్లలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్లలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళు తున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు సీక్రసీ -పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు

**న్యూఢిల్లీ,,జూన్8((ప్రజావినికిడి):**




మే 3న జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చన్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్‌టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహా ఈ పక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు. ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్‌టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# తృణమూల్ నేత జంగీర్ ఖాన్ అరెస్ట్

## దేశ సరిహద్దులు దాటుతుండగా పట్టివేత -ఖాన్‌పై పలు కేసులు నమోదు

**కోల్‌కతా్,,జూన్8((ప్రజావినికిడి):** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా ఫాల్తా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతు లకు గురిచేయడం, భూఅక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి.



తనపై నమోదైన వరుస కేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18న కోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించి నప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసంహరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తన క్లయింట్‌పై కావాలనే వరుస కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ పగతో జరుగుతున్న వేధింపులని జహంగీర్ ఖాన్ తరపు సీనియర్ న్యాయవాది కిషోర్ దత్తా కోర్టులో వాదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఈ వాదనను గట్టిగా వ్యతిరేకించారు. మే 21న ఫాల్తా నియోజకవర్గంలో జరిగిన రీ-పోలింగ్‌లో ఖాన్ పాల్గొనేందుకు మాత్రమే గతంలో కోర్టు రక్షణ ఇచ్చిందని, మే 24న ఫలితాలు కూడా వచ్చేసినందున ఇక ఆ ప్రొటెక్షన్‌ను పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గ రీ-పోలింగ్ సమయంలో బెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది.

# చరిత్ర సృష్టించిన భారత్



**భారత్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన అఫ్ఘనిస్థాన్..**

**ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో భారీ విజయం!**

**భారత స్పిన్‌కు అఫ్గాన్ ఆటగాళ్లు కాకావికాలం**

**తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్**

**రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ప్యాకప్**

**ఏడు వికెట్లతో సత్తాచాటిన మానవ్ సుతార్**

**నిప్పులు చెరిగిన కుల్దీప్, వాషింగ్టన్ సుందర్**




ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్థాన్ జట్టు చిత్తు చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయిన అఫ్ఘన్.. రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ముగించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 564/8 పరుగులు చేయడంతో.. ఈ టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టెస్టుతో డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. భారత్ – అఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ టెస్టులో టీమిండియా ఆధిపత్య ధోరణి ప్రదర్శించింది. ఆరంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ షిప్ 2025 –27లో టీమిండియాకు ఈ విజయం చాలా సపోర్ట్ ఇవ్వనుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ టెస్టులో మూడో రోజు అఫ్ఘనిస్థాన్ రెండుసార్లు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 113/5తో మూడో రోజు ఆట మొదలుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. మొదటి సెషన్‌లోనే 152 పరుగులకే ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ప్రారంభించిన అఫ్ఘనిస్థాన్ లంచ్ బ్రేక్‌కి ముందు ఎలాంటి వికెట్లు కోల్పోలేదు. లంచ్ బ్రేక్ తర్వాత టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి వికెట్ తీసుకోగా.. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లను పెవిలియన్‌కు క్యూ కట్టించాడు. ఓపెనర్ సెడికుల్లా అటల్ క్రీజులో ఉన్నంత సేపు కొంచెం పోరాడిన అఫ్ఘనిస్థాన్ ఆ తర్వాత నుంచి కుప్పకూలింది. దాంతో మూడో రోజు ఆట మిగిలుండగానే అఫ్ఘనిస్థాన్ కేవలం 112 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లలో సెడికుల్లా అటల్ 42, రహ్మనుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేయగా.. మిగతా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో సుందర్ 4, కుల్దీప్ 3, మానవ్ సుతార్ 1, సిరాజ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 127 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది. కేఎల్ రాహుల్ 100, శుభ్‌మన్ గిల్ 126, సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేశాడు. ఈ టెస్టుతో ఎంట్రీ ఇచ్చిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్ ఒకటి ఓవరాల్‌గా ఏడు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. 412 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్గానిస్థాన్ 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్(80 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 42), రెహ్మనుల్లా గుర్బాజ్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వాషింగ్టన్ సుందర్(3/30), కుల్దీప్ యాదవ్(4/36) అఫ్గాన్ పతనాన్ని శాసించారు. మానవ్ సుతార్‌కు ఒక వికెట్ దక్కింది. గాయంతో షరాఫుద్దిన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు. 14 పరుగుల వ్యవధిలోనే అఫ్గాన్ చివరి 6 వికెట్లు కోల్పోవడం గమనార్హం. భారత బౌలర్లలో మానవ్ సుతార్(6/33) 6 వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించగా.. ప్రసిధ్ కృష్ణ(3/37) మూడు వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్(1/21) ఒక వికెట్ దక్కింది. భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. టెస్ట్ క్రికెట్ అనుభవలేమి అఫ్గాన్ కొంపముంచింది. అఫ్గాన్ బ్యాటింగ్ వైఫల్యంతో మూడో రోజు ఆటలో రెండున్నర సెషన్ల ఆట మాత్రమే సాధ్యమైంది. స్కోర్లు:భారత్ తొలి ఇన్నింగ్స్ – 564–8 డిక్లేర్డ్అఫ్గానిస్థాన్ తొలి ఇన్నింగ్స్ – 152– 10అఫ్గానిస్థాన్ రెండో ఇన్నింగ్స్ – 112 – 10భారత్ సాధించిన అతిపెద్ద ఇన్నింగ్స్ విజయాలు: ఇన్నింగ్స్ 300 పరుగులు జం ఆఫ్గానిస్థాన్– ముల్లాన్ పూర్, 2026ఇన్నింగ్స్ 272 పరుగులు జం వెస్టిండీస్– రాజ్‌కోట్, 2018ఇన్నింగ్స్ 262 పరుగులు జం ఆఫ్గానిస్థాన్– బెంగళూరు, 2018ఇన్నింగ్స్ 239 పరుగులు జం బంగ్లాదేశ్– మీర్పూర్, 2007 ఇన్నింగ్స్ 239 పరుగులు జం శ్రీలంక– నాగ్‌పూర్, 2017

## బౌలర్లు అలసిపోకపోవడంతోనే ఫాలో ఆన్ ఆడించాం

**• టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్**



తమ బౌలర్లు అలసిపోకపోవడంతోనే అఫ్గానిస్థాన్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ప్రస్తుతం భారత టెస్ట్ టీమ్ సంధి దశలో ఉందని, పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ విభాగంలో మార్పులు ఉంటాయని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గిల్.. ఇది సంపూర్ణ విజయమని తెలిపాడు. 'ఇది ఒక సంపూర్ణమైన విజయం. మూడు విభాగాల్లో రాణించాం. అందుకే ఈ విజయం చాలా సంతోషాన్నిచ్చింది. వాతావరణం చాలా వేడిగా ఉంది. లంచ్‌కు ముందు లేదా మొదటి డ్రింక్స్ విరామం తర్వాతే వారిని ఆలౌట్ చేస్తే.. మా బౌలర్లు అలసిపోకుండా ఉన్నారో లేదో చూసి ఫాలో–ఆన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఒకవేళ అలా కాకపోతే.. మేం ఒక రెండు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసి.. చివర్లో అఫ్గాన్‌కు బ్యాటింగ్ అప్పగించాలని అనుకున్నాం. కానీ మాకు వేగంగా వికెట్లు దక్కాయి. దాంతో మ్యాచ్‌పై పట్టు సాధించాం. అలాగే మా ఫాస్ట్ బౌలర్లు బౌలింగ్ చేసిన తీరు కూడా అద్భుతం. మేం ఫాలో–ఆన్ ఇచ్చినప్పుడు సిరాజ్ కీలకమైన వికెట్ అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ప్రసిద్ధ్ మూడు ముఖ్యమైన వికెట్లు తీశాడు.మానవ్ సుతార్, వాషింగ్టన్, కుల్దీప్‌ల నైపుణ్యం, నాణ్యతపై మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ ఎక్కువ ఓవర్లు వేయించి వారికి తగి అనుభవం దక్కేలా చూశాం. ఇలాంటి పిచ్‌లపై బ్యాటర్లను ఎలా బోల్తా కొట్టించాలి, పేస్‌ను ఎలా మారుస్తూ ఉండాలి, వేర్వేరు ఏరియాల్లో బ్యాటర్లను ఎలా పరీక్షించాలి అనే విషయాలను తెలుసుకోవడం ముఖ్యం.ఇది యువ జట్టు. ట్రాన్సిషన్ దశలో ఉంది. కాబట్టి జట్టులో మార్పులు ఉంటాయి. అయితే పరిస్థితులు, వేదికలతో సంబంధం లేకుండా ముందుగా బ్యాటింగ్ చేసినప్పుడు బోర్డుపై 350 పరుగులు ఉంచడానికి ప్రయత్నించాలి. ఎక్కడైనా సరే 20 వికెట్లు తీయగలరనే నమ్మకం మా బౌలింగ్ గ్రూప్‌పై ఉంది.

## టెస్ట్ క్రికెట్‌లో అనుభవం లేకపోవడంతోనే ఓటమి

**- అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ వ్యాఖ్యలు**

టెస్ట్ క్రికెట్‌లో ఆడిన అనుభవం లేకపోవడంతోనే ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్నామని అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ అన్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించిందని అభినందనలు తెలిపాడు. మానవ్ సుతార్ అద్భుతమైన బౌలింగ్‌కు చేతులెత్తేసామని, పిచ్ కూడా మారిందని, స్కోర్ బోర్డు ఒత్తిడి కూడా తమ పతనాన్ని శాసించిందని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హష్మతుల్లా..ఓడినా సానుకూల అంశాలు ఉన్నాయని చెప్పాడు.'భారత్‌కు నా అభినందనలు. ఇది మాకు ఒక కఠినమైన రోజు. కఠినమైన మ్యాచ్. మ్యాచ్ ఆరంభం నుంచే మేం వెనుకపడ్డాం. మా బౌలింగ్‌లో క్రమశిక్షణ లేదు. ఆరంభం నుంచే భారత్ ఆధిపత్యం చెలాయించింది. నిజం చెప్పాలంటే.. మాకు ఈ ఫార్మాట్‌లో అంతగా అనుభవం లేదు. ఈ మ్యాచ్ నుంచి మేం చాలా నేర్చుకున్నాం.ఎందుకంటే మాకు ఈ ఫార్మాట్ ఆడేందుకు తగినన్ని అవకాశాలు లభించవు. కానీ తమ సొంత పరిస్థితులలో ఆడేటప్పుడు ఇండియా చాలా కఠినమైన జట్టు అని అందరికీ తెలుసు. అయితే మాకు చాలా పాఠాలు లభించాయి. ఈ ఓటమి నుంచి మేము నేర్చుకుంటాం. పరిస్థితులు మరింత కఠినంగా మారినప్పుడు.. ఒత్తిడిలో ఎలా ఆడాలో ఈ మ్యాచ్ మాకు నేర్పించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా మాకు కొన్ని సానుకూల అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా సలీమ్ అద్భుతంగా రాణించాడు. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీలోనే సత్తా చాటాడు. అలాగే బ్యాటింగ్‌లో రహమత్ తొలి ఇన్నింగ్స్‌లో చాలా బాగా ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెదిక్ పర్వాలేదనిపించాడు. మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు.



## ముందింది ఫిఫా వరల్డ్ కప్ సంగ్రామం

**• జూన్ 11 నుంచి జులై 19 వరకు టోర్నీ • 48 జట్లు, 104 మ్యాచ్‌లతో ఫిఫా వరల్డ్ కప్ • అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో ఫిఫా సందడి • 39 రోజులు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ పండుగ**


ఫుట్‌బాల్ ప్రేమికుల కలల వేదిక, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రీడా సంబరం ఫీఫా ప్రపంచకప్ మరోసారి సరికొత్త రికార్డులతో మన ముందుకురాబోతోంది. 2026లో జరగబోయే ఈ టోర్నమెంట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఇప్పటి వరకు మనం చూసిన ప్రపంచ కప్‌ల కంటే ఇది భిన్నంగా, భారీగా ఉండబోతోంది. ప్రపంచకప్ ఎందుకు ప్రత్యకమైందో తెలుసుకోవాలంటే ముందుగా దాని పరిమాణాన్ని చూడాలి. గతంలో 32 జట్లు మాత్రమే టోర్నీలో పాల్గొనేవి. కానీ ఈసారి ఏకంగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరుకుంది. ఇది ఫుట్‌బాల్ ప్రపంచంలో అతి పెద్ద, సుదీర్ఘమైన టోర్నమెంట్‌గా నిలవనుంది. సుమారు 39 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులను ఈ టోర్నీ ఉర్రూతలూగించనుంది. ఈ మెగా టోర్నీకి ఉత్తర అమెరికా ఖండంలోని మూడు దేశాలు కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జూన్ 11న మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మకమైన మెక్సికో సిటీ స్టేడియంలో ఘనంగా ప్రారంభంకానుంది. ఆతిథ్య దేశం మెక్సికో తన సొంత గడ్డపై స్థానిక అభిమానుల కేరింత మధ్య తొలి మ్యాచ్ ఆడనుంది. జులై 19న న్యూయార్క్–న్యూజెర్సీ స్టేడియంలో ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది. ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఫిఫా జట్ల సంఖ్యను పెంచింది. దీని వల్ల మరిన్ని దేశాలకు ప్రపంచ క్ వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలోనే కేప్ వెర్దే, కురాకో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాలు తొలిసారిగా ప్రపంచకప్ బరిలోకి దిగుతున్నాయి. ఇది ఆయా దేశాల్లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి గొప్ప ఊతాన్ని ఇస్తుంది. మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ఇవి ఏ నుంచి ఎల్ వరకు ఉన్నాయి. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా నాకౌట్ దశకు చేరుకుంటాయి. వీరితోపాటు, 12 గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 8 మూడవ స్థాన జట్లు కూడా నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీని వల్ల మొదటిసారిగా ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 32 అనే కొత్త దశను ప్రవేశ పెట్టారు. అంటే టైటిల్ గెలవాలంటే ఒక జట్టు గతంలో లాగా 7 మ్యాచ్‌లు కాకుండా, ఈసారి 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

## గెలుపే నా టార్గెట్..

**నా కెప్టెన్సీ నాదే.. ఎవరి మాట నేను వినను**

**ముంబై స్ట్రీట్ క్రికెట్ నుంచి చాలా నేర్చుకున్నా..**

**టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**




ఇండియా టీ20 టీమ్ కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ అఫీషియల్ గా అనౌన్స్ అయ్యాడు. సెలెక్షన్ కమిటీ మీటింగ్ లో 31 ఏళ్ల అయ్యర్ ను ఈ పొజిషన్ కు ఎంపిక చేశారు. మార్చి నెలలో ఇండియాకు టీ20 వరల్డ్ కప్ అందించి సక్సెస్ ఫుల్ గా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో అయ్యర్ బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఈ కొత్త రెస్పాన్సిబిలిటీ పై శ్రేయాస్ అయ్యర్ స్పందిస్తూ, కెప్టెన్ అయ్యాను కదా అని తన పర్సనాలిటీ ని మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరి నీడలోనో ఉండటానికి తాను ఇష్టపడనని, ముంబై లో కఠినమైన క్రికెట్ ఎన్విరాన్‌మెంట్ లో పెరిగిన పాత శ్రేయాస్ లాగే ఉంటానని స్పష్టం చేశాడు. ముంబై లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఛాలెంజ్ లను ఫేస్ చేయడం అలవాట అయిందని అయ్యర్ ఒక ఈవెంట్ లో గుర్తు చేసుకున్నాడు. అక్కడ క్రికెట్ క్రేజ్ చాలా ఎక్కువని, స్ట్రీట్ లో ఆడే ప్రతి చిన్న పిల్లాడు ముంబై టీమ్ కు ఆడాలని కలలు కంటాడని చెప్పాడు. అటువంటి హై కాంపిటీషన్ నుంచి రావడం వల్లే తన మైండ్ సెట్ ఎప్పుడూ గెలవడం పైనే ఉంటుందని తెలిపాడు. ప్రతి మ్యాచ్ లో గెలవడం, కొత్త విషయాలు నేర్చుకోవడం తన అలవాటని, ఈ కంపిటీటివ్ నేచరే తనను ఈ స్టేజ్ కి తీసుకొచ్చిందని అన్నాడు. ఇప్పుడు వచ్చిన కెప్టెన్సీ ఒక గ్రేట్ ఛాలెంజ్ అని, దీన్ని లీడ్ చేయడానికి తాను రెడీగా ఉన్నానని హింట్ ఇచ్చాడు. శ్రేయాస్ అయ్యర్ కు కెప్టెన్సీ ఇవ్వడం పై బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్, మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ పాజిటివ్ గా రెస్పాండ్ అయ్యాడు. అయ్యర్ బాగా పర్ఫార్మ్ చేశాడని, ఈ కెప్టెన్సీ రోల్ కు అతడు వంద పర్సెంట్ అర్హుడని ప్రశంసించాడు. అలాగే సూర్యకుమార్ యాదవ్ ను కెప్టెన్సీ నుంచి తీసేయడం అన్యాయం ఏమీ కాదని, సెలెక్టర్లు టీమ్ ఫ్యూచర్ ను దృష్టిలో ఉంచుకొని ఈ కఠినమైన నిర్ణయం తీసుకున్నారని గంగూలీ వ్యాఖ్యానించాడు.

కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ కు ఐర్లాండ్ టూర్ ఫస్ట్ అసైన్ మెంట్ కాబోతోంది. అక్కడ ఇండియా టూ టీ20 మ్యాచ్ లు ఆడనుంది. అయ్యర్ డిసెంబర్ 2023 లో తన లాస్ట్ టీ20 మ్యాచ్ ఆడాడు, ఆ తర్వాత ఫామ్ కోల్పోయి టీమ్ లో ప్లేస్ పోగొట్టుకున్నాడు. ఇప్పుడు మళ్లీ మిడిల్ ఆర్డర్ లో సూర్యకుమార్ యాదవ్ కు లైక్–టు–లైక్ రీప్లేస్ మెంట్ గా టీమ్ లోకి వచ్చి డైరెక్ట్ గా కెప్టెన్ సీటును దక్కించుకోవడం విశేషం.

# యశ్ 'టాక్సిక్' నుంచి స్పెషల్ వీడియో..

## దర్శకురాలి ప్రతిభకు ఫిదా అవుతున్న ఫ్యాన్స్

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్'. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ చిత్ర దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఒక ప్రత్యేకమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియోను విడుదల చేసి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



ఈ బీటీఎస్ వీడియోలో దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తనదైన శైలిలో చిత్రాన్ని ఎలా తెరకెక్కిస్తున్నారో చూపించారు. భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నప్పుడు ఆమె కమాండింగ్ ప్రెజెన్స్, నటీనటుల నుంచి నటనను రాబట్టుకుంటున్న తీరుతో పాటు భారీ సిబ్బందిని ఎంతో నమ్మకంతో, కచ్చితత్వంతో నడిపిస్తున్న విధానం ఆకట్టుకుంటోంది. ఈ వీడియోతో పాటు, "ప్రతి షాట్ ప్రత్యేకంగా ఉండటం వెనుక, సంభాషణల కన్నా మౌనమే ఎక్కువ చెప్పడం వెనుక ఆమె ఉన్నారు! హ్యాపీ బర్త్‌డే గీతూ మోహన్‌దాస్" అంటూ చిత్ర బృందం ఒక సందేశాన్ని జోడించింది. ఈ వీడియో కేవలం మేకింగ్ విజువల్స్ మాత్రమే కాకుండా సినిమా ఎంత భారీ స్థాయిలో నిర్మాణం జరుపుకుంటోందో కూడా తెలియజేస్తోంది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతటి భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి చిత్రాన్ని ఒక మహిళా దర్శకురాలు డైరెక్ట్ చేయడం చాలా అరుదు. గీతూ మోహన్‌దాస్ ఎంతో ఆత్మవిశ్వాసంతో ఈ ప్రాజెక్టును ముందుండి నడిపిస్తూ, సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న విషయంలోనూ పాలుపంచుకుంటున్నారు.

'టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్' పేరుతో వస్తున్న ఈ సినిమాలో యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, రుక్మిణీ వసంత్, తారా సుతారియా వంటి ప్రముఖ తారలు నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. కాగా, ఇటీవలే 'సినిమాకాన్' ఈవెంట్‌లో ఈ చిత్రానికి గ్లోబల్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో సినిమాను మరింత విస్తృతంగా అంతర్జాతీయ స్థాయిలో విడుదల చేసేందుకు వీలుగా రిలీజ్ డేట్‌ను వాయిదా వేసిన సంగతి తెలిసిందే. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటించనున్నారు.



# అభిమానులతో కలసి పెద్దిని వీక్షించిన రామ్‌చరణ్

గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన నటించిన 'పెద్ది' చిత్రాన్ని ఆదివారం రాత్రి చిత్రబృందం, అభిమానులతో కలిసి వీక్షించారు. సినిమాకు వస్తున్న స్పందన, పలు సన్నివేశాలకు ప్రేక్షకులు కనెక్ట్ అయిన తీరును గమనించిన ఆయన ఒకింత భావోద్వేగానికి లోనై కంట తడిపెట్టుకున్నారు. కొన్ని సన్నివేశాలకు ఆడియన్స్ రియాక్ట్ అయిన తీరు చూసి ఆనందించారు. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి వసూళ్ల వర్షం కురిపిస్తోంది. మూడు రోజుల్లో ఈ చిత్రం రూ.236 కోట్లు కలెక్ట్ చేసింది. మొదటి మూడు రోజులు థియేటర్ల దగ్గర అభిమానులు హవా కొనసాగగా, వీకెండ్ నుంచి ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు. మరో పక్క జాన్వీకపూర్ పోషించిన పాత్రపై టోల్రింగ్ జరగగా దర్శకుడు క్షమాపణ చెప్పి అభ్యంతరకర సన్నివేశాలను తొలగిస్తామని తెలిపారు.

# 'సింగ్ గీతం'.. 20 ఏళ్లప్పుడు విన్న కథ, 70 ఏళ్లకు చూస్తున్నా: కమల్ హాసన్



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన వెరైటీ కథా చిత్రం 'సింగ్ గీతం'. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా బ్యానర్లపై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రంలో ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ప్రధాన పాత్రలు పోషించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈ సినిమా జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చెన్నైలో గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై, దర్శకుడు సింగీతంతో తనకున్న అనుబంధాన్ని, ఆయన ప్రతిభను కొనియాడారు.ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ, "మాయాబజార్ నుంచి ఇప్పటి సింగ్ గీతం వరకు సింగీతం గారిలో మార్పు లేదు. సినిమా ఆయనతోనే ఉంది. ఇది చాలా అరుదు. నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు ఆయనతో పనిచేయడం మొదలుపెట్టాను. ఆయన సినిమాకు నిర్మాతగా, సహాయ దర్శకుడిగా కూడా పనిచేశాను. చాలా ఏళ్ల క్రితం ఆయన నాకు రెండు కథలు చెప్పారు. ఒకటి 'పుష్పక విమానం'గా వచ్చింది. ఇప్పుడు రెండో కథ 'సింగ్ గీతం'గా రాబోతోంది. అప్పుడు నాకు 20 ఏళ్లు, ఇప్పుడు 70. ఇన్నాళ్లకు ఆ సినిమాను చూడబోతున్నాను. కొన్ని ఆలోచనలు, కథలు టైమ్‌లెస్‌గా ఉంటాయి. సింగీతం గారి కథలు అలాంటివే" అని అన్నారు.సింగీతంతో తనకున్న బంధాన్ని గుర్తుచేసుకుంటూ, "పుష్పక విమానం సినిమాను ఫైవ్‌స్టార్ హోటల్‌లో, పూర్తిగా ఏసీలో తీశామని గర్వంగా చెప్పుకుంటాం. అలాగే 'ముంబై ఎక్స్‌ప్రెస్' చిత్రాన్ని కూడా ఎంతో ఎంజాయ్ చేస్తూ చేశాం. సింగీతం గారు ఇప్పటి జెన్జీ కంటే ముందుంటారు. ఆయనకు సహాయ దర్శకుడిగా ఉండటానికి నేను ఇప్పటికీ ఇష్టపడతాను. 'సింగ్ గీతం' సినిమాను నేనే నిర్మించిన భావన కలుగుతోంది. ఇది రాజ్ కమల్ ఫిల్మ్స్ నిర్మించి ఉంటే బాగుండేదని అనిపించే చిత్రాల్లో ఒకటి. మూడు నెలల ముందే చెప్పి ఉంటే, నేను కూడా యూనిట్‌లో భాగమై ఉండేవాడిని" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు.సినిమా పట్ల ప్యాషన్ ఉండాలని చెబుతూ, "సినిమా అనేది ప్యాషన్‌తో చేయాల్సిన పని. అలా చేస్తేనే పుష్పక విమానం లాంటి ఊహించని విజయాలు వస్తాయి. ఆ ప్యాషన్‌ను మనం సింగీతం గారి నుంచి నేర్చుకోవాలి. ఈ సినిమాను అంత ప్యాషన్‌తో నిర్మిస్తున్న వైజయంతి మూవీస్, స్వప్న గారికి ధన్యవాదాలు. 'సింగీతం' గారి పేరును చాలామంది 'సంగీతం' అని తప్పుగా పలుకుతారు. కానీ ఈ సినిమాతో ఆ కన్ఫ్యూజన్ పోతుంది. ఇకపై అందరూ 'సింగీతం' అనే సరిగ్గా పిలుస్తారు" అని కమల్ హాసన్ తన ప్రసంగాన్ని ముగించారు

# అలాంటి పాత్రలకు మమ్మల్ని ఎందుకు నిందిస్తారు?: డింపుల్ హయతి ఆవేదన

మనకు మంచి సినిమాలు, మెరుగైన అనుభవాలు అవసరమని పిలుపు

టాలీవుడ్ నటి డింపుల్ హయతి సినీ పరిశ్రమలో హీరోయిన్లకు ఇస్తున్న పాత్రలపై, వారిని నిందించే ధోరణిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బలహీనమైన పాత్రలు చేసినందుకు నటీమణులను నిందించడం సరికాదని, అసలు తప్పు అలాంటి పాత్రలే అమ్ముడవుతాయని నమ్మే వ్యవస్థది, దర్శకనిర్మాతలదని ఆమె స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. 'పెద్ది'లో జాన్వీ కపూర్ వంటి స్టార్ హీరోయిన్ కు ఇచ్చిన పాత్రపై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో డింపుల్ హయతి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

"ఈ రోజు మనం నటీమణుల పాత్రలు ఎలా రాస్తున్నారు అనే దాని గురించి మాట్లాడుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక పాత్ర చేసిన తర్వాత వెంటనే ఆ నటిని నిందించే ధోరణి కనిపిస్తోంది. కానీ, దయచేసి నటిని నిందించకండి. వ్యవస్థను, మేకర్స్‌ను నిందించండి. ఎందుకంటే, ఏది అమ్ముడుపోతుందని వారు నమ్ముతారో, అలాంటి పాత్రలనే సృష్టిస్తారు.

మేము నటీనటులుగా, మాకు లభించిన అవకాశాల పరిధిలోనే పనిచేస్తాం. వాటితోనే పెద్ద సినిమాలు చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ఆశిస్తాం. ఒకవేళ పాత్రలు బలంగా లేకపోతే, ఆ బాధ్యత ఆ పాత్రను పోషించిన నటిపై కాకుండా, ఆ కథను రాసిన రచయితలు, తీసిన దర్శకులపైనే ఎక్కువగా ఉంటుంది.


దురదృష్టవశాత్తు, మేము పోషించే పాత్రల వల్ల మమ్మల్ని ఒక మూసలో బంధించేస్తున్నారు. మా పూర్తి నటనను ప్రదర్శించే అవకాశం ఇవ్వకుండానే ఒక ఇమేజ్‌ను కట్టబెడుతున్నారు. అదే హీరో సెంట్రిక్ కథల విషయానికొస్తే, వారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. మనం ఏది చూస్తామో దాన్నే నమ్ముతాం. కానీ, సినిమా నిర్మాణం వెనుక ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఇది ఒక్కరి చేతిలో ఉండే నిర్ణయం కాదు.



# బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల





పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె.హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.



# జీ కి దక్కిన వృషకర్మ శాటిలైట్ హక్కులు ?

తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.. 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్‌రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613